TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 121 | మంగళవారం, డిసెంబర్ 24, 2024 | పేజీలు : 5 | వెల :4/-



# విచారణకు రండి..

## ఉదయం 11 గంటలకు రావాలని అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు

నేటి నుంచి రోజువారీ విచారణ?..
బడ్జెట్ పెరిగితే టికెట్ రేట్లు పెంచాలి

సీఎంను కలిసే అంశంపై దిల్ రాజు..
వచ్చాక నిర్ణయం: నిర్మాత నాగవంశీ

ధరల పెంపు మధ్యతరగతికి భారం..
ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఏపీ ప్రభుత్వమూ ఇలాగే చెయ్యాలి..
ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటన

శ్రీతేజ్‌కు 'పుష్ప' నిర్మాతల పరామర్శ

కోమటిరెడ్డితో కలిసి ఆస్పత్రికి వెళ్లి
అతడి తండ్రికి రూ. 50 లక్షల చెక్



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 : మధ్యంతర బెయిల్‌పై ఉన్న నటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మంది మీద కేసులు

(మిగతా 2వ పేజీలో)

# రైతు ఖాతాల్లోకి రూ. 530 కోట్ల సన్నాల బోనస్

కొద్ది రోజుల్లో మరో రూ. 370 కోట్లు

ఇప్పటివరకు రూ.903 కోట్ల విలువైన 18 ఎల్ఎంటీ సన్నాల కొనుగోలు

అత్యధికంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సేకరణ.. అత్యల్పంగా ఆదిలాబాద్‌లో..

హైదరాబాద్: ఖరీఫ్ సీజన్‌లో సన్నాలు పండించిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన సత్ఫలితాన్నే ఇస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సన్నధాన్యం పంట గణనీయంగా పెరిగింది. రైతులు తమ తిండి అవసరాల కోసం మిగిల్చుకున్న సన్న ధాన్యం పోను... కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 18.07 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) సన్నాలను విక్రయించారు. సన్నాలు విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 530 కోట్లను బోనస్ రూపంలో జమచేసింది. మరో రూ. 373 కోట్లను కొద్దిరోజుల్లోనే జమ చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. ఇప్పటివరకు 3,24,338 మంది రైతులు సన్నాలను విక్రయించినట్లు పౌరసరఫరా శాఖ వర్గాలు తెలిపాయి. ఈ రైతులకు క్వింటాలుకు మద్దతు ధర రూ. 2,320తోపాటు రూ. 500 బోనస్ కలిపి 2,820 ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రబీ (యాసంగి)లో సన్నాల సాగు పెంచేందుకు రైతులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. వచ్చే సంక్రాంతి వరకు ఖరీఫ్ సీజన్ కొనుగోళ్లు ఉంటాయని భావిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు మరో 2 ఎల్ఎంటీల సన్న ధాన్యం వచ్చే అవకాశం ఉంది. 46 ఎల్ఎంటీల సేకరణ: రాష్ట్రంలో హైదరాబాద్

(మిగతా 2వ పేజీలో)



## 30న కేబినెట్ భేటీ.. రేషన్‌కార్డులపై చర్చ

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ ఈనెల 30వ తేదీన భేటీ కానుంది. మంత్రి వర్గ సమావేశం సందర్భంగా తెలంగాణలో రైతులకు రైతు భరోసా, రేషన్ కార్డుల విధి విధానాలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వివరాల ప్రకారం.. 'ఈనెల 30న తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరుగనుంది. ఈ సందర్భంగా రైతు భరోసా, రేషన్‌కార్డుల విధివిధానాలపై కేబినెట్ చర్చించే అవకాశం ఉంది. ఇదే సమయంలో భూమిలేని పేదలకు నగదు బదిలీపై కేబినెట్‌లో చర్చించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తోంది.



## పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

మలేషియా
వ్యాపారవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు



## 10 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకున్నాం

రోజ్‌గార్ మేళాలో
కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్
అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

# జర్నలిస్టుపై దాడి కేసు.. మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

ఆయన హృద్రోగి, వైద్యుల పర్యవేక్షణ అవసరం

హైకోర్టుకు మోహన్‌బాబు లాయర్ల విన్నపం

విలేకరిని కొట్టారు, గొంతు పట్టి పిసికారు

హత్యాయత్నమే: జర్నలిస్టు తరఫు వాదనలు

పోలీసుల ముందు హాజరుకు నేడే గడువు

సుప్రీంలో అదృష్టం పరీక్షించుకొనే అవకాశం



## విష్ణుతో నాకు ప్రాణహాని



2లో

నేను లేనప్పుడు మా అమ్మను మాయ చేశారు

సంతకం తీసుకొని.. పోలీసులకు తప్పుడు లేఖ

రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు

పహాడీషరీఫ్ స్టేషన్‌లో ఏడు పేజీల లేఖ అందజేత

హైదరాబాద్, డిసెంబరు 23 : జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మోహన్‌బాబు తరఫున న్యాయవాది వాదిస్తూ, 78 ఏళ్ల వయస్సులో మోహన్‌బాబు గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని,

(మిగతా 2వ పేజీలో)



## గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

వీరిలో అత్యధిక మంది మహిళలే

ఇదో రికార్డు: ప్రధాని మోదీ

ఢిల్లీ రోజ్‌గార్ మేళాలో
71 వేల మందికి నియామక పత్రాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 23: కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇదో రికార్డు అని.. ఇంతవరకు ఏ సర్కారూ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవని చెప్పారు. సోమవారమిక్కడ 'రోజ్‌గార్ మేళా'కు ఆయన వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 71 వేల మందికిపైగా నియామక పత్రాలు అందజేశారు. తన

(మిగతా 2వ పేజీలో)

# మేడిగడ్డ బ్యారేజీ కేసు కొట్టేయండి

భూపాలపల్లి జిల్లా కోర్టుకు అధికార పరిధి లేదు

హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు క్వాష్ పిటిషన్

హైదరాబాద్, డిసెంబరు 23 : మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై భూపాలపల్లి జిల్లా కోర్టులో ఉన్న కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో సోమవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంగుబాటు అంశంపై వివరణ ఇవ్వాలని కేసీఆర్, హరీశ్‌రావు, అప్పటి నీటి పారుదల శాఖ కార్యదర్శి రజత్ కుమార్, అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు హరిరామ్, శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత మేఘా కృష్ణారెడ్డి, ఎల్ అండ్ టీ సంస్థలకు భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ కుంగుబాటుకు

(మిగతా 2వ పేజీలో)



# విచారణకు రండి..

నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. అయన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం రిమాండు విధించింది. అల్లు అర్జున్ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం.. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం అల్లు అర్జునేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. అదే రోజు సాయంత్రం అల్లు అర్జున్ పత్రికా సమావేశం నిర్వహించి, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పిన విషయం విదితమే. అసలు రేవతి మరణం గురించి తనకు మర్నాటిదాకా తెలియదని.. ఆరోజు రాత్రి థియేటర్‌లో పోలీసులు తనవద్దకు రాలేదని బన్నీ చెప్పగా.. థియేటర్ నుంచి ఆరోజు రాత్రి ఆయన్ను తాము దగ్గరుండి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. అల్లు అర్జున్‌ను పోలీసులు విచారణకు పిలవడం గమనార్హం. జరిగిన దుర్ఘటన గురించి మర్నాడు ఉదయం వరకూ తనకు తెలియదని అల్లు అర్జున్ చెప్పిన నేపథ్యంలో.. ఆయన్ను ఎంతసేపు విచారిస్తారు? ఏయేప్రశ్నలు అడిగే అవకాశం ఉందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా.. ఈ కేసు విషయమై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం ఒక్కరోజే కాక.. రోజూ విచారణకు పిలిచే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

**సినీ వర్గాల సమావేశం..**

సంధ్య థియేటర్ దుర్ఘటన నేపథ్యంలో బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దీనిపై ఫిలిం చాంబర్ సోమవారం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరై చర్చించారు. ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. టికెట్ రేట్లు పెంచబోమని అంటే ఎలా అని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. "సినిమాకు అనుకున్న బడ్జెట్‌కు మించి ఖర్చు అయినప్పుడు మాత్రమే టికెట్ రేట్లు పెంచాలని అడుగుతాం తప్ప.. ప్రతి సినిమాకూ అడగం" అని నిర్మాత నాగవంశీ అన్నారు. దీనిపై సీఎంను కలిసే ఆలోచన ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ఆయన ఇక్కడికి వచ్చాక ముందు ఆయనతో సమావేశమై తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని నాగవంశీవెల్లడించారు. సినిమా ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోదని ఆయన పేర్కొన్నారు. కాగా.. టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ చైర్మన్ విజేందర్ రెడ్డి ప్రకటించారు. "సినిమా టికెట్ ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. పెరిగిన టికెట్ రేట్లతో మధ్య తరగతి ప్రేక్షకులు, విద్యార్థులు సినిమాలకు రాలేకపోతున్నారు. ఇది కలెక్షన్లపైనా ప్రభావం చూపుతోంది. టిక్కెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని ఆయన చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లే ఏపీ ప్రభుత్వమూ బెనిఫిట్ షోస్, టికెట్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ ఎస్.రామ్ ప్రసాద్ అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. సినిమాను ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడం ఎలా అనే దానిపై నిర్మాతలు దృష్టి పెట్టాలి" అని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సెక్రటరీ బాల గోవింద్ రాజ్ సూచించారు. టీఎఫ్‌పీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ కూడా.. టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల చిన్న సినిమాలకు మంచి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "పెద్ద సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలపై భారం పడుతోంది. ఏడాదికి రిలీజయ్యే చిత్రాల్లో చిన్న చిత్రాలే 90 శాతం ఉన్నాయి. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద చిత్రాలు ఉంటున్నాయి. చిన్న చిత్రాలకు డిజిటల్ రైట్స్ విషయంలో యూఎఫవో క్యూబ్ ధరలు అధికంగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాలో రూ.1500 ఉంటే మన దగ్గర పది వేలు వారానికి వసూలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**నిర్మాతల సాయం..**

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను 'పుష్ప-2' నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి పరామర్శించారు. అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. బాలుడికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. "ఇక ఈ విషయాన్ని రాజకీయం చెయ్యొద్దు. సినీ హీరోల ఇళ్లపై దాడులు చెయ్యొద్దు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అన్నారు. సినీ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, పరిశ్రమ ఎక్కడికీ వెళ్లడం లేదని.. వదంతులను ఎవరూ నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ ఇంటిపై ఓయూ జేఏసీ నేతల దాడిని ఆయన ఖండించారు. దాడులు చేస్తే చట్టం ఊరుకోదని మంత్రి హెచ్చరించారు. కాగా.. తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. అతడు క్రమంగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పడుతోందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా తెలిపారు. కాగా.. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటి రెడ్డి స్పందించిన తీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్య, వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించిన ఆయన.. రేవతి కుటుంబాన్ని, శ్రీతేజ్‌ను ఆదుకోవడానికి ఆర్య, వైశ్య మహాసభ ముందుంటుందని తెలిపారు. కాగా.. శ్రీతేజ్‌కు చికిత్స తామే చేయిస్తున్నామంటూ అల్లు అర్జున్ అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని తెలంగాణ ఆర్య, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చామని చెబుతున్న అల్లు అర్జున్ ఇప్పటికి ఇచ్చింది రూ.10 లక్షలేనన్నారు.

**ఓయూ జేఏసీ నేతలకు బెయిల్**

అల్లు అర్జున్ ఇంటి ఎదుట నిరసనకు దిగి, దాడికి పాల్పడిన ఆరుగురు ఓయూ జేఏసీ నేతలకు బెయిల్ మంజూరైంది. వారిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు.. వనస్థలిపురంలో ఉన్న న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లి హాజరుపరచగా.. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని అదేశించారు. అడ్డగూడూరుకు చెందిన బైరు నగేష్, దౌలతాబాద్‌కు చెందిన రెడ్డి శ్రీనివాస్, కొడంగల్‌కు చెందిన మోహన్, చౌటుప్పల్‌కు చెందిన బి.నాగరాజు, చర్లపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, షాద్‌నగర్‌కు చెందిన ప్రకాష్ జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటివద్ద ఆదివారం ఆందోళనకు దిగి పూలకుండీలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకొని ప్రతినిధులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

# రైతు ఖాతాల్లోకి రూ. 530 కోట్ల సన్నాల బోనస్

మినహా 32 జిల్లాల్లో 7,624 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 46,02,099 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఇందులో సన్న రకం 18.07 ఎల్ఎంటీ కాగా, దొడ్డు రకం 27.95 ఎల్ఎంటీ. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోగా, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో ఇంకా కొనుగోళ్లు సాగుతున్నాయి. సంక్రాంతి వరకు మరో 10 ఎల్ఎంటీల వరకు ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. బోనస్‌తో సంబంధం లేకుండా... ఇప్పటివరకు కొనుగోలు చేసిన 46.02 ఎల్ఎంటీ ధాన్యానికి రూ.10,675.15 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.9,890.46 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమచేశారు. ఇంకా రూ.784.69 కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరాల్సి ఉంది.

**అధిక ధరకు విక్రయించిన రైతులు**

రాష్ట్రంలో ఈసారి అత్యధికంగా కోటీ 50 లక్షల మెట్రిక్ టన్ను ల మేర ధాన్యం దిగుబడి అయినట్లు ప్రభుత్వం చెపుతోంది. 91 ఎల్ఎంటీలు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసింది. నాణ్యమైన రకాలకు చెందిన బియ్యాన్ని ఇప్పుడే క్వింటాలుకు రూ. 6వేల వరకు విక్రయిస్తున్నారు. ధాన్యం విక్రయాల్లో ఇప్పటివరకు అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 4,90,906 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. తరువాత స్థానంలో కామారెడ్డి జిల్లాలో 4,36,979 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. ఈ రెండు జిల్లాల్లోనే (ఉమ్మడి నిజామాబాద్) ఏకంగా 9.27 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేయడం గమనార్హం. రాష్ట్రంలో కొనుగోలు చేసిన ధాన్యంలో 20 శాతానికి పైగా ఇక్కడి నుంచే కావడం విశేషం. తరువాత స్థానాల్లో ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. అత్యల్పంగా కేవలం 1951 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే విక్రయించి ఆదిలాబాద్ ఆఖరి స్థానంలో నిలిచింది.

# పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

## మలేషియా వ్యాపారవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడుల కోసం తెలంగాణలో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దు ద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టా లని మలేషియా పారిశ్రామికవేత్తలను కోరారు. శ్రీధర్‌బాబు గత నెలలో మలేషియా తెలుగు మహాసభలకు హాజరైన సంద ర్భంగా అక్కడి పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానిం చారు. ఈ మేరకు పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ చొరవతో సోమవారం సచివాలయంలో మలేషియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సౌర విద్యుత్ రంగం, డ్రైపోర్టుల నిర్మాణం, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు.

**రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి**

హుస్సేన్ సాగర్‌లో పూడికతీత, మురుగు నీటి శుద్ధికోసం అత్యాధునిక సీవరేజీ ప్లాంట్ల ఏర్పాటులో పాలు పంచుకో వాలని మలేషియా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డ్రైపోర్టుల నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుతం మలేషియా నుంచి పామాయిల్ మొలకలు దిగుమతి చేసుకుంటున్నామని, అలా కాకుండా విత్తనాలు సరఫరా చేయడానికి గానీ, ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేయడానికి గానీ ముందుకొస్తే సహకరిస్తామని చెప్పారు.

# గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలన్నీ యువత కేంద్రకంగానే ఉన్నాయని ప్రధాని చెప్పారు. రోజ్‌గార్ మేళాలతో వారికి సాధికారత లభిస్తోందని.. వారి సామర్థ్యం వెలికివస్తోందని అన్నారు. 'పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే. అతివలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. 26 వారాలు మాతృత్వ సెలవులివ్వాలన్న నిర్ణయం వారి కెరీర్లకు ఎంతో ఉపకరిస్తోంది. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించే ఇళ్లకు వారే యజమానులు. దేశంలో వారి నేతృత్వంలోనే అభివృద్ధి సాగుతోంది. మన యువత శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. వారి కోసమే పలు పథకాలు తెచ్చాం. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అంతరిక్ష, రక్షణ రంగాల్లో సంస్కరణలు ఈ కోవలోవే. యువత అభివృద్ధికి జాతీయ విద్యావిధానం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మాతృభాషల ఉపయోగానికి పెద్దపీట వేస్తోంది' అని వివరించారు. సోమవారం మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిఅని.. దేశ పురోగతికి గ్రామీణ భారతం అభివృద్ధి అని ఆయన గట్టిగా చెప్పేవారని.. దానినే తన ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని.. స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం తమ అదృష్టమన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ కేసు కొట్టేయండి

కేసీఆర్ సహా ఇతరులు కారణమని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి మొదట మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. తమకు పరిధి లేదని పేర్కొంటూ మేజిస్ట్రేట్ కోర్టు సదరు పిటిషన్‌ను కొట్టేసింది. దాంతో ఆయన జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రివిజన్ పిటిషన్‌లోనే భూపాలపల్లి జిల్లా కోర్టు కేసీఆర్ సహా ఇతరులకు నోటీసులు జారీ చేసింది. రివిజన్ పిటిషన్‌ను స్వీకరించే అధికార పరిధి భూపాలపల్లి జిల్లా కోర్టుకు లేదని, దాన్ని కొట్టేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావులు హైకోర్టును ఆశ్రయించారు. ఒక్కసారి మేజిస్ట్రేట్ కోర్టు తనకు పరిధిలేదని ప్రైవేటు ఫిర్యాదును కొట్టేసిన తర్వాత రివిజన్ పిటిషన్ విచారణకు స్వీకరించి ప్రైవేటు ఫిర్యాదును తిరిగి తెరిచే అధికారం జిల్లా కోర్టుకు లేదని అన్నారు. కోర్టుకు అధికారమే లేనిచోట తమకు నోటీసులు జారీ చేయడం అనే సమస్యే తలెత్తదని చెప్పారు. సీఆర్పీసీకి విరుద్ధంగా రివిజన్ పిటిషన్‌ను జిల్లా కోర్టు స్వీకరించిన విధానం తప్పుడు సంకేతాలను పంపుతుందని తెలిపారు. ఒకవేళ జిల్లా కోర్టు విచారణ పూర్తి చేసి ఈ అంశాన్ని మళ్లీ మేజిస్ట్రేట్ కోర్టుకు పంపినా తన ఉత్తర్వులను తానే మళ్లీ పునః పరిశీలించే అధికారం మేజిస్ట్రేట్ కోర్టుకు ఉండదని చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఉన్న కేసుతో పాటు జూలై 10న ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. కేసీఆర్, హరీశ్‌ల పిటిషన్ త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానుంది. లగచర్ల ఘటన నేపథ్యంలో దాఖలైన మరో కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. భూసేకరణ విచారణకు వెళ్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడిని అడ్డుకోవడమే కాకుండా ఆయన కారును ధ్వంసం చేశారని పేర్కొంటూ బొమ్రాసపేట పోలీసులు ఎఫ్ఐఆర్ నెంబర్ 145 నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుతానికి నరేందర్‌రెడ్డి నిందితుడిగా లేకపోయినప్పటికీ తర్వాత నిందితుడిగా చేర్చి పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో నరేందర్‌రెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

# జర్నలిస్టుపై దాడి కేసు.. మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

నిరంతరం వైద్యుల పర్యవేక్షణ అవసరమని చెప్పారు. మోహన్‌బాబు దుబాయిలో మనుమడిని చూసి వచ్చాక, ప్రస్తుతం తిరుపతిలో ఉన్నారని వెల్లడించారు. తన విద్యా సంస్థల పర్యవేక్షణ కోసం తిరుపతి వచ్చారని చెప్పారు. ముందస్తు బెయిలు పిటిషన్‌ను ప్రభుత్వ న్యాయవాది వ్యతిరేకించారు. డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సోమవారం వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరపు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప మార్గం లేదు. మోహన్‌బాబు ఈ నెల 24 లోపు పోలీసుల ముందు హాజరు కావాలని గతంలోనే హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సుప్రీంకోర్టులో ప్రయత్నం చేసిన అనంతరం మోహన్‌బాబు పోలీసుల ముందు హాజరవుతారని భావిస్తున్నారు.

# విష్ణుతో నాకు ప్రాణహాని

## రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబరు 23 : సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో తలెత్తిన వివాదం మరో మలుపు తిరిగింది. తన అన్న విష్ణు, ఆయన అనుచరుల నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ మోహన్‌బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్.. రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏడు పేజీల లేఖను పహాడీషరీఫ్ పోలీసులకు అందజేశారు. కుటుంబంలో గొడవలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలన్నింటినీ వివరంగా రాసి, కొన్ని సీసీటీవీ ఫుటేజీలను, ఇతర టెక్నికల్ ఆధారాలను పోలీసులకు సమర్పించడంతోపాటు ఫిర్యాదు లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో.. మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమాలు జరుగుతున్నట్లు, విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని మనోజ్ తెలిపారు. దాంతో ఈ ఏడాది సెప్టెంబరు 11న యూనివర్సిటీ బాధ్యతలు చూస్తున్న వినయ్ మహేశ్వరిని ఆ అక్రమాలపై నిలదీశానని పేర్కొన్నారు. అయితే ఆయన తనపైనే ఆగ్రహం వ్యక్తం చేశారని, వివిధ ఫోన్ నంబర్‌ల నుంచి ఫోన్ చేసి బెదిరించారని చెప్పారు. "అనంతరం సెప్టెంబరు 13న మా నాన్న మోహన్‌బాబు ఫోన్ నుంచి విష్ణు, వినయ్ తప్పుడు మెసేజ్ పంపారు. ఆస్తికోసం గొడవ పెట్టుకుంటున్నావా? అంటూ నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మెసేజ్ చేసి, నన్ను దోషిలా నిలబెట్టారు." అని లేఖలో మనోజ్ వివరించారు.

**అమ్మను మాయ చేశారు..**

"నేను ఇంట్లో లేని సమయంలో మా అమ్మ వద్దకు వచ్చిన విష్ణు, అతని మనుషులు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. వారికి అనుకూలంగా లేఖ రాశారు. ఆ తర్వాత అమ్మను మాయచేసి ఆ లేఖ అమ్మ రాసిందని పోలీసులకు పంపించి మీడియాకు తెలిసేలా చేశారు. నన్ను అందరి దృష్టిలో చెడ్డవాణ్ని చేయాలని ప్రయత్నించారు." అని లేఖలో మనోజ్ తెలిపారు. డిసెంబరు 14న తమ తల్లి పుట్టినరోజును ఆసరాగా చేసుకొని తన కుటుంబసభ్యులకు హాని చేసే ప్రయత్నం జరిగిందని మనోజ్ ఆరోపించారు. అమ్మ పుట్టినరోజుకు కేక్ ఇచ్చే నెపంతో విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్‌లు ఇంటికి వచ్చారని, ఈ సమయంలో వారు తన జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారని తెలిపారు. దాంతో కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్

# 10 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకున్నాం

**రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్**

**అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత**





బిట్స్‌పిలానీ, చార్మినార్, డిసెంబరు 23 : దేశంలోని 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకున్నదని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అన్నారు. సోమవారం రోజ్‌గార్ మేళా (ఉద్యోగ ఉపాధి) 14వ ఎడిషన్‌లో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొని మాట్లాడారు. పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగ నియమక పత్రాల అందజేత కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం, కుటుంబంతో పాటు దేశ సేవలో యువత నీతి నీజాయితితో విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. మోదీ సూచన మేరకు 2020 అక్టోబరు నుంచి ప్రారంభించిన రోజ్‌గార్ మేళాలో, నేటి వరకు దాదాపు పది లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 526 మంది యువతకు ఆయన నియమక పత్రాలను అందించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హకీంపేట్‌లోని సీఐఎసఎఫ్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. మరో 75 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తే తమ లక్ష్యం పూర్తవుతుందన్నారు. ఇవే కాకుండా యువత స్వయం శక్తితో ఎదిగే విధంగా ప్రభుత్వ రుణాలను అందిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 2028 నాటికి ప్రపంచ దేశాలలో మన దేశం ఆర్థికంగా మూడో స్థానానికి చేరుతుందని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 348 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
మంగళవారం, డిసెంబర్ 24, 2024

# పొలాసలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం






**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 23 :** జగిత్యాల జిల్లా గ్రామీణ మండలంలోని పొలాసలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ కారణంగా ఎడెల్లి గంగారం అనే వ్యక్తి ఇంటికి మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఆ ఇంట్లో ముగ్గురు కుమారులు వేరువేరు రూములలో నివసిస్తూ ఉంటారు.ఇంట్లో లేని సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. మల్లన్నపేటలోని మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడం వలన ప్రాణ నష్టం తప్పినప్పటికీ, అగ్ని ప్రమాదం వల్ల రూ. 20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేయబడింది.సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది స్పందన మంటలు చెలరేగిన వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటివరకు ఇంట్లోని బహుముఖ ఆస్తి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న డబ్బు బంగారం అంతా ధ్వంసం అయింది.ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు స్థానికులు, ప్రభుత్వం ముందుకు రావాలని కోరుతున్నారు.

# మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు సంక్రాంతి

## ముత్యాల ముగ్గుల పోటీలు



**శేర్లింగంపల్లి(మన వెలుగు)డిసెంబర్ 23:** మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఈరోజు మాదాపూర్ డివిజన్ పరిధిలో గల చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ లో స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాము అని అన్నారు. ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపు పిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటి లోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీర భంగిమలలో పనిచేయవలసి ఉటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారుఅని అన్నారు. పోటీలలో విజేతల ఎంపికలో తాటిచర్ల వరలక్ష్మి, అనూషా జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 50 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ (చంద్ర రాజేశ్వరరావు) ఫౌండేషన్ డైరెక్టర్ (మహిళా విభాగం) జ్యోస్యభట్ల కల్పన, ట్రెజరర్ సి ఆర్ ఫౌండేషన్ వి .చెన్నకేశవ రావు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవత యంత్ర స్థాపన పూజలు



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 23 :** బాసర పురాతన ఆలయం శ్రీ పాపహరేశ్వర ఆలయ పునర్నిర్మాణ,దేవత యంత్ర స్థాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలోని అతి పురాతన ఆలయం శ్రీ పాపహారేశ్వర ఆలయ శిఖర, ఉత్సవ విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.సోమవారం వైదిక బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణాల మధ్య శ్రీ పాపహరేశ్వర స్వామివారికి అభిషేకం,అర్చన ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు.అంతకు ముందు,శ్రీ పాపహారేశ్వర,పరివార దేవతలైన గణపతి, సంతాన నాగేంద్రుడు, అన్నపూర్ణ, నందీశ్వరుడు, కాలభైరవుడు, వీరభద్రుడు, బలిఫ శ్రీ తాలు,ధ్వజస్తంభం,నవగ్రహల దేవతా ఉత్సవమూర్తులకు అభిషేకం, అర్చన పూజల అనంతరం శ్రీ మంగి రాములు మహారాజ్, విద్యానంద నాథ స్వామి చేతుల మీదుగా యంత్ర స్థాపన పూజలను నిర్వహించారు. నాగేష్ అప్ప ఆధ్వర్యంలో ప్రాతకాల పూజలు పాంచాచార్య పూజ స్థాపిత మండపా రాధన,ఉత్తర పాల్గున నక్షత్ర యుక్త కుంభ లగ్నంలో యంత్ర ప్రతిష్టాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహా పూజ బలిహర ణం,మహా హారతి మంత్రపుష్పం వేదోపచారంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.పంచాచార్య పూజ స్థాపిత దేవతా మండపారాధన,హవనము బింబశుద్ధి, మహాస్నపన ము, శివుడికి రుద్రాభిషేకం, బిల్వర్చన,వంటి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మహిళా భక్తులచే సామూహిక మంగళ హారతి,ప్రదోషకాల పూజ మహా హారతి,మంత్ర పుష్పం వేదోపచార పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూనియన్ సీటు ఆధ్వర్యంలో రోడ్డుపై బేటాయించి ధర్నా

## బొమ్మెన సురేష్ సిఐటియు



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 23 :** గత నాలుగు నుంచి మధ్యన భోజన కార్మికులు వంటబందే సమ్మె నిర్వహించడం జరుగుతుంది.ఈ సందర్భంగా మధ్యా హ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికలు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 10000, రూపాయలు ఇవ్వాలని కోరుతూ. జిల్లాలో తనూరు మండల కేంద్రంలో రోడ్డుపై బెటాయించి ధర్నా నిర్వహించడం జరిగింది.మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెను చార్జీలు పెండింగ్ లో ఉన్నాయి. నెలలు తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసే ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, విద్యార్థులకు వంట చేసి పెడుతున్నారు. దీంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చేసిన వాటికి బిల్లులు రాలేదు, పైగా రాగి జావా పోయాలి. బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. బిల్లులు విడుదల చేయకుండా వండటం ఎలా, కనుక ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరుతున్నామని,పెండింగ్లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి, ప్రభుత్వమే కోడిగుడ్లు నేరుగా అందించాలి.పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లలకిచ్చే మెను చార్జీలు పెంచాలి.తక్షణమే పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి.ఎన్నికలు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం 10000 రూపాయలు అమలు చేయాలి. ప్రతి స్కూలుకు గ్యాస్ సిలిండర్ ఇవ్వాలి, అవసరమైన గ్యాస్ను సరిపరి చేయాలి. ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.మధ్యాహ్న భోజనం నిర్వహణను అక్షయ పాత్రలాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదు. ఎలాం టి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు కల్పించాలి. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు, తనూరు మండల అధ్యక్షులు గంగాధర్, సవితబాయ్,లాలు, గంగాధర్, దోడివా, నాగబాయ్,రుక్కుమ్మబాయ్ తదితరులు పాల్గొన్నారు




# బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కూకట్పల్లి (మన వెలుగు)డిసెంబర్ 23:** బాలానగర్ పోలీస్ స్టేషన్ లో సెమీ-క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో పోలీస్ స్టేషన్ లో పండుగ వాతావరణం నెలకొంది. డెక్కన్ విజన్ పాత్రికేయుడు రవి కుమార్ ఆధ్వర్యంలో ఎలిమ్ ఏం.బి. చర్చ్ యూత్ సహకారంతో నిర్వహించిన వేడుకల్లో బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు, సీఐ నర్సింహా రాజు, డిఐ నాగి రెడ్డి, పాస్టర్లు రేవ్. జి.కె. ప్రసాద్, రేవ్. కె. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకాగా క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా రేవ్. జి.కె. ప్రసాద్ మాట్లాడుతూ భూలోకమునకు యేసుక్రీస్తు పుట్టుక, లోక మానవాలికి కలిగే ఆనందం గూర్చి యేసుక్రీస్తు జీవిత చరిత్ర గురించి వివరించారు. యేసుక్రీస్తును జాననం గురించి ఆరాధిస్తూ ప్రార్ధనలు, గీతాలాపనలు చేశారు. తదుపరి రేవ్. కె. శ్రీనివాస్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు, క్రిస్మస్ కేక్‌ను బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు, సీఐ నర్సింహా రాజు, రేవ్. జికె ప్రసాద్, రేవ్. కె. శ్రీనివాస్ తోకలిసి కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యేసుక్రీస్తు తెలిపిన ప్రేమ, కరుణ సామరస్య విలువలను కలిగి ఉండాలని కోరారు. బాలానగర్ పోలీస్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆనందకరమైన సందర్భాన్ని జరుపుకోవడం, సఖ్యత పండుగ స్ఫూర్తిని బలోపేతం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐ. బి. నాగి రేడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, హాజీ మియా, సుభాష్, సరళ, సరితా రెడ్డి, ఏఎస్ఐలు ఆంజనేయులు, నర్సింహులు, ఇతర సిబ్బంది ఎలిమ్ ఏం.బి. చర్చ్ యూత్ పరంజ్యోతి, పృథ్వీ రాజ్, అనుదీప్, సందీప్, రాహుల్, జోయెల్, బన్నీ సెమీ-క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.




# నూతన చట్టాలపై అవగాహన

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 23 :** పెగడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మూఢనమ్మకాలు,సైబర్ క్రైమ్, సామాజిక రుగ్మతలు,ట్రాఫిక్ నియమాలు,నూతన చట్టాల గురించి అవగాహన కార్యక్రమం పోలీస్ కళాబృందం చే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సి.హెచ్ రవికిరణ్ పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ప్రధాని పి.వి నర్సింహారావుకు ఘన నివాళులు

కూకట్పల్లి (మన వెలుగు)డిసెంబర్ 23 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా, అనేక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి. సేవలు చిరస్మరణీయం - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం భారత రత్న, ఆర్థిక సంస్కరణల పితామహుడు, రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధాని పి.వి. నర్సింహా రావు 20 వ వర్ధంతి సందర్భంగా నెక్లస్ రోడ్ లోని పి.వి. జ్ఞాన భూమి వద్ద ఘనంగా నివాళులు అర్పించి, మీడియా సమావేశంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , వ్యవసాయ, సహకార చేనేత శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పి.వి. ప్రభాకర్ రావు, సత్తుపల్లి శాసన సభ్యులు మట్టా రాగమయి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. మాట్లాడుతూ భారతదేశ తెలుగు ప్రజలు గర్వించదగ్గ నాయకుడు పి.వీ నరసింహారావు తెలంగాణ పల్లె నుంచి దేశ ప్రధానిగా అంచెలంచెలుగా ఆయన ఎదిగిన తీరు ఆదర్శనీయమని, దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవి అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా పీ.వీ నరసింహారావు సేవలందించడం మనందరికీ గర్వకారణమని, ఆయన రక్షణ, విదేశాంగ, హెూంశాఖా మంత్రిగా, ముఖ్యమంత్రిగా, బహు బాషా వేత్తగా, రచయితగా, న్యాయ శాస్త్ర కోవిదులు, అపర చాణక్యుడిగా పేరొందారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకొని, భారత ఆర్థిక సంస్కరణలకు పితామహుడిగా పేరొందిన మేధావి అని, భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి చట్టాన్ని, భూ సంస్కరణలు అమలు చేసి మిగులు భూములు పంచిన ఘనత పీవీ దేనని, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా గురుకుల పాఠశాలలు విద్యారంగానికి ఎనలేని సేవలు అందించి, విద్య వ్యవస్థ పటిష్ట పరిచి ఇంత ఉన్నత స్థాయికి రావడానికి ప్రధాన కారణం ఆయనేనని, పీవీ కీర్తిని పెంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆయన ఆలోచన విధానాలు కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడు ఉపయోగపడుతాయని అన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
మంగళవారం, డిసెంబర్ 24, 2024

# ప్రముఖ వ్యాఖ్యాత-పద్యకవి వెంకట్కు శ్రీమద్భగవద్గీతా సన్మానం





**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 23 :** యాద్రాద్రిభువనగిరి జిల్లాలోని షారాజీపేటలో సోమవారం జరిగిన బహుమతులు, సన్మానసభలో జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాఖ్యాత-పద్యకవి బి. వెంకట్ శ్రీమద్భగవద్గీతా ఆధ్యాత్మిక సేవా సన్మానమును అమెరికాకు చెందిన గట్టు నర్మద- వేణుగోపాల కృష్ణమూర్తి పుణ్య దంపతులచేతుల మీదుగా పొందారు. గీతాజయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి యాదాద్రి జిల్లా సమీ పానగల ఆలేరు దగ్గరలో నిర్మించబడిన భారతదేశంలోని మొట్టమొదటి గీతాస్తూపం ఆధ్యాత్మికక్షేత్రంలో నిర్వహిం చబడిన శ్రీమద్భ గవద్గీతా శ్లోక పఠనస్పర్ధల్లో డిసెంబర్ 1నుండి 11వ తేదీవరకు జరిగిన ఆధ్యాత్మికపరమైన సేవా కార్యక్రమాల్లో విశేషమైన విశిష్టమైన సేవలను అందించారు. శ్లోకపఠనస్పర్ధలకు న్యాయ నిర్ణేతగా సంధానకర్తగా సభా కార్యక్రమ నిర్వాహకులుగా సభక్తిపూర్వకముగా సేవలను అందించారు. 150 కి పైగా ఆ జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల 8, 9 ,10 తరగతుల బాల బాలికలకు పోటీలను నిర్వహించారు. ఇందుకు గుర్తింపుగా అమెరికాలోని స్థిర నివాసం ఏర్పరచుకున్న శ్రీమాన్ గట్టు వేణుగోపాల కృష్ణమూర్తి నర్మదా దంపతులు బి. వెంకట్ కు న్యాయ నిర్ణేతగా బాధ్యతలను అప్పగించగా ఆయన సమర్ధవంతంగా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. 700 శ్లోకాలతో కూడిన గీతాస్తూపంలో శ్రీకృష్ణ పరమాత్మ, విష్ణు భగవానుని విగ్రహము వ్యాసమహర్షి ఆదిశంకరాచార్యులు, మధ్వాచార్యులు, శ్రీమద్రామానుజాచార్యులు విగ్రహాల విశిష్టతలను అక్కడి భక్తులకు వివరించారు. భారతదేశంలో ప్రప్రథమ గీతాస్తూపమును స్థాపించి యూట్యూబ్ ఛానల్ ద్వారా అనేకమైన ఇతర ఛానల్ ద్వారా భగవద్గీతా గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పుచున్న ఆ దంపతులను భారతీయులందురూ కొనియాడుతున్నారని ఆయన చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మికోపన్యాసకులు గీతాన్యాయనిర్ణేతలు-సౌమిత్రి శ్రీధరాచార్యులు, డా. శ్రీ భాష్యం శ్రవణ్ కుమార్ ఆడెపు ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, సంపత్ కుమార్, వెంకట్రామయ్య, రాము, జె తిరుపతిరెడ్డి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు, రాము, తిరుమలాచార్యులు, యువకులు, విద్యార్థినీ విద్యార్థులు,భక్తులు పాల్గొన్న ఈ గీతోత్సవాలలో వెంకట్ కృషి చాలా గొప్పదని చెప్పవచ్చు.



## విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ

**ముధోల్ (మనవెలుగు) డిసెంబర్ 23 :** తానూర్ మండలం లోని బోర్గావ్ జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థి సీఎం క్యాంప్ నిర్మించినట్లు తెలంగాణ ప్రభుత్వం మల్లేష్ జిల్లా కేంద్రంలో నిర్వహించి నటువంటి పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే, నిర్మల్ జిల్లా స్థాయిలో జీవశాస్త్రం విభాగంలో రెండవ స్థానంలో వైభవ్ విద్యార్థులను మాజీ ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్ సోమవారం పాఠశాలలో వెళ్లి సన్మానించడం జరిగింది. ఈనెల 28న జాతీయ స్థాయిలో పాల్గొనడానికి మల్లేష్ వెళ్తున్నట్టు ప్రధాన ఉపాధ్యాయులు శంకర్ తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రకంత్ యాదవ్, పాల్జా దత్తాత్రి, ప్రధాన ఉపాధ్యాయు లు శంకర్, గ్రామ ప్రజలు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం!

**జనవరి రెండో వారం తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు.**

**పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలలో సవరణలు పూర్తయ్యాయి**

**బీసీ రిజర్వేషన్లను ట్రిపుల్ టెస్ట్ ద్వారా ఖరారు చేయనున్నారు**

**కొత్తగా 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు ఏర్పాటు**

**ముందుగా గ్రామీణ, ఆ తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు**




**ముధోల్ ( మన వెలుగు) డిసెంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం జనవరి రెండో వారం తర్వాత షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలకు చేసిన సవరణలు ఇప్పటికే గవర్నర్ ఆమోదం పొందాయి. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు సూచించిన విధంగా ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియ ద్వారా ఖరారు చేస్తారు. ఈ దిశగా డెడికేటెడ్ కమిషన్ గ్రామాల్లో నివేదిక సిద్ధం చేయడం పూర్తిచేసింది.ఇటీవల చేపట్టిన చట్ట సవరణలతో కొత్తగా 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో ప్రారంభించి, తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల ద్వారా పార్టీ కార్యకర్తలకు పదవులు కేటాయించే అవకాశాలు అధికంగా ఉండటంతో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది.



## స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలిచేలా కృషి చేయాలి

### బిజెపి మండల అధ్యక్షుడు కోరిపోతన్న

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్23 :** ముధోల్ మండలంలోని బ్రహ్మంగావ్ గ్రామంలో సోమవారం బిజెపి నాయకులు బూత్ కమిటీల అధ్యక్షులను కార్యదర్శిలను నియమించారు అధ్యక్షుడిగా రాజుల పెద్దరాజు, కార్యదర్శిగా సతీష్ ను ఎన్నుకున్నారు రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపు చేయాలని పేర్కొన్నారు అనంతరం అతనికి ఇచ్చిన సద్వినియోగం చేసుకుంటామని పేర్కొన్నా రు మండల అధ్యక్షుడు పోతన్న, మాజీ సర్పంచ్,లో గంగాధర్ తదితరులు ఉన్నారు

# ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 23 :** మండల కేంద్రమైన ముధోల్లోని రవీంద్రా ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి శిశు మందిర్తో పాటు మండలంలోని బ్రహ్మణగా వ్లోని హైందవి పాఠశాలలో సోమవారం ఘనంగా జాతీయ రైతు దినోత్సవం అదేవిధంగా భారత మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని తెలిపారు. రైతు పంటను పండించకపోతే ప్రజల జీవనం కొనసాగడం కష్టమేనన్నారు. రైతును ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. అదేవిధంగా మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతిని పూరస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. రవీంద్ర ప్రిన్సిపల్ అసంవార్ సాయినాథ్, కరెస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, చైర్మన్ భీమ్రావు దేశాయి, శిశు మందిర్ ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు, హైందవి ప్రిన్సిపల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ యోగేష్ పాటిల్, పాఠశాల బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## గ్రామపంచాయతీ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

### సీఐటియూ

### జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్

**ముధోల్ (మనవెలుగు) డిసెంబర్ 23 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయ తీలలో పనిచేస్తున్న 60 వేల మంది కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, వారికి ప్రభుత్వ ఉద్యోగు లతో సమానంగా వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మెన సురేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం ముధోల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచి, ప్రజల ఆరోగ్యాన్ని, గ్రామాలను కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేసి, పదవీ విరమణ అనంతరం 10 లక్షల రూపాయల గౌరవవేతనం కల్పించాలన్నారు . ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బహుళ పని విధానం గ్రామపంచాయతీ కార్మికులకు అతి ప్రమాదకరమైనదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల మెడపై ఉరితాడులా మారిన మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం 9500 రుపాయలు కనీస వేతనంగా నిర్ణయించి అమలు చేస్తుంటే ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలం గడిచిన గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపిం చారు. వెంటనే ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్చించి, నిర్ణయం తీసుకోకుంటే ఈనెల 27-28న టోకెన్ సమ్మె చేస్తామని, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మండల యూనియన్ అధ్యక్షులు ఆకాష్, కేర్బా, లక్ష్మణ్ (సుబ్బు ), తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ అక్షరలో ఘనంగా గణిత దినోత్సవం

**ముధోల్ (మన వెలుగు) డిసెంబర్ 23 :** మండల కేంద్రమైన ముధోల్లోని శ్రీ అక్షర పాఠశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవం వేడుకలలో విద్యార్థిని, విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల మ్యాథ్స్ వర్కింగ్ మోడల్స్, గణిత శాస్త్రం పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించిన గణిత శాస్త్రం యొక్క మోడల్ ను పాఠశాలలోని విద్యార్థులు తిలకించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ నంబర్ 1729 ఆకారంలో కూర్చోవడం అందరిని ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ సుభాష్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గారి స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు గణితం పై ఎక్కువ మక్కువను పెంచుకొనివాలని సూచించారు. రామానుజన్ గణితాన్ని సులువుగా చేసే అనేక పద్ధతులను తెలియజేయడం పట్ల గణితాన్ని ఇష్టంగా చేయడంలో విద్యార్థులు ముందుకు వెళ్తున్నారని అన్నారు. మనిషి జీవితంలో ప్రాణవాయువు అయినటువంటి ఆక్సిజన్ ఎంత ముఖ్యమో అలాగే జీవితంలో గణితం అనేది కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.



## మా ఇంటికి పోనిస్తలేరు...!

**ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా బండ రాళ్లు వేశారు**

**పది నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదు**

**పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు**

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 23 :** జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలోని జగదేవపేట గ్రామానికి చెందిన వృద్ధులు వారి పట్టా భూమిలో ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా వారి కొడుకు, కోడలు, మనుమలు, మనుమరాళ్లు అదే గ్రామంలో వేరే చోట ఇళ్లు కట్టుకొని ఉంటున్నారు.కాగా వృద్ధులు ఉండే ఇంటికి వెళ్లే ప్రభుత్వ దారిని అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబం కబ్జా చేసి వృద్ధులకు రాకపోకలు లేకుండా బేసిమెంట్ బండ రాళ్లు దారికి అడ్డంగా వేశారు. ఈ విషయం గురించి వారి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ కార్యదర్శి,వెల్గటూర్ ఎమ్మార్వో, ఎంపిడివో, ఎంపివో లకు ఫిర్యాదు చేయగా వారు చర్యలు తీసుకుపోగా మా పరిధి కాదు అని తప్పించుకున్నారు.వృద్ధులు చేసేది లేక జిల్లా కలెక్టర్ కు ప్రజవాణిలో జూన్ నెలలో లో ఫిర్యాదు చేయగా జులై నెలలో గ్రామ కార్యదర్శి ఇరువర్గాల వారికి నోటీసులు ఇచ్చారు.కానీ దర్యాప్తు కోసం ఏ అధికారి మా గ్రామానికి వచ్చింది లేదు, ఇప్పటి వరకు మా సమస్య తీర్చింది లేదు. అందుకే మళ్ళీ మా అత్తామామలతో కలిసి ఫిర్యాదు చేయడానికి వచ్చామని ఇకనైనా మా సమస్య తీర్చి మా అత్తా మామల ఇంటికి వెళ్ళే దారి ఇప్పించగలరని కలెక్టర్ ను వేడుకున్నారు నూకల దీవెన.



# యాపిల్‌ని కన్నడలో ఏమంటారో చెప్పండి?

కన్నడ స్టార్ సుదీప్ ప్రస్తుతం తన తాజా సినిమా 'మ్యాక్స్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కన్నడ మీడియాకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సుదీప్‌తో ఓ విలేఖరి.. 'మీరు కన్నడ నటుడు అయ్యుండి సినిమాకు ఇంగ్లీష్‌లో పేరు ఎందుకు పెట్టారు?' అని ప్రశ్నించాడు. దాంతో సుదీప్ కాసేపు మౌనంగా ఉండిపోయారు. అనంతరం ఆ విలేఖరి వైపు సూటిగా చూస్తూ.. అతనికి తనముందున్న మైకుల్ని చూపిస్తూ.. వీటిని కన్నడంలో ఏమంటారు? అనడిగారు. సదరు విలేఖరి నుంచి సమాధానం లేదు. 'సరే.. వీటిని ఇంగ్లీష్‌లోనే ఎందుకు పిలుస్తారు?.. నేను కన్నడ నటుడ్నని ప్రపంచానికి తెలుసు. ఎందుకంటే కన్నడలోనే మాట్లాడతాను కాబట్టి. నేనున్న సినిమా కన్నడ సినిమా అని కూడా అందరికీ తెలుసు. ఇక పేరుతో ప్రమేయం ఏముంది? అలా అయితే.. కర్ణాటకలో ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఉండకూడదు. అసలు మీ సమస్య ఏంటి? ఏ ఫర్ యాపిల్ అంటారు కదా.. యాపిల్‌ను కన్నడలో ఏమంటారో చెప్పండి?' అని ప్రశ్నిచే సరికి సదరు విలేఖరి నీళ్లు నమిలాడు.

# అది నిజంగా నా విజయమే



'యానిమల్'కి ముందు కూడా త్రిప్తి డిమ్రీ సినిమాలు చేసింది. కానీ గుర్తింపు రాలేదు. కానీ 'యానిమల్' తర్వాత రాత్రికి రాత్రి స్టార్ అయి కూర్చుంది. రీసెంట్‌గా ఈ అందాలభామ మరో అఛీవ్‌మెంట్ కూడా సాధించింది. బాలీవుడ్‌లో తన తోటి హీరోయిన్లందర్నీ వెనక్కు నెట్టి నంబర్‌వన్‌గా నిలిచింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. అసలు విషయం ఏంటంటే.. అసలే బాలీవుడ్‌లో స్టార్ట్స్ తాకిడి ఎక్కువ. వారందరినీ దాటుకొని గూగుల్ సెర్చ్‌లో నంబర్‌వన్‌గా నిలిచింది త్రిప్తి డిమ్రీ. ఇది కూడా తక్కువ విషయమేం కాదు. ఈ పరిణామంపై తెగ సంబరపడిపోతున్నది ఈ అందాలభామ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'నా గురించి తెలుసుకోవాలని ఇంతమంది ఉత్సాహపడ్డారంటే అది నిజంగా నా విజయమే. ఈ క్రేజ్‌కి కారణం 'యానిమల్'. థ్యాంక్యూ సందీప్ సార్. 'యానిమల్ 2' కోసం ఎదురు చూస్తున్నా. అందులోనూ అందరూ మెచ్చేలా నా పాత్ర ఉంటుంది.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డిమ్రీ.




# క్రికెట్‌కి సచిన్.. ఇండియన్ సినిమాకు శంకర్

'శంకర్‌గారు కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో, ఇండియన్ సినిమాకు శంకర్‌గారు అలా. అలాంటి శంకర్‌గారితో పనిచేయడం నా అదృష్టం. నానుంచి సోలో ఫిల్మ్ వచ్చి అయిదేళ్లయింది. ఇది నాకు ప్రత్యేకమైన సినిమా. ఈ మూవీ ఏ ఒక్కర్నీ నిరాశపరచదు.' అని రామ్‌చరణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఎస్.శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా జనవరి 10న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికా డల్లాస్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమానికి అగ్ర దర్శకుడు సుకుమార్ అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "రంగస్థలం'కు రామ్‌చరణ్ జాతీయ అవార్డు తీసుకుంటాడని ఆశించా. కానీ రాలేదు. అయితే.. 'గేమ్ చేంజర్' ట్రైమాక్స్ చూశాక, ఈ సినిమాలోని రామ్‌చరణ్ నటనకు పక్కాగా జాతీయ అవార్డు వస్తుందనిపించింది.' అని తెలిపారు. 'మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్ సినిమా తీయడం ఇదే ప్రథమం. శంకర్‌గారి సినిమా సెల్‌ఫోన్‌లో చూస్తే ఫీల్ రాదు. దాన్ని బిగ్ స్క్రీన్‌పైనే ఎక్స్‌పీరియన్స్ చేయాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ అంశాలు ఈ సినిమాలో చాలా కనిపిస్తాయి. శంకర్‌గారు అన్నీ తానై నడిపించారు. ఈసారి మామూలుగా కొట్టడంలేదు. గట్టిగా కొట్టబోతున్నాం.' అని దిల్‌రాజు నమ్మకం వ్యక్తం చేశారు. శంకర్ మాట్లాడుతూ 'పోకిరి, ఒక్కడు లాంటి మాస్ మసాలా సినిమా చేయాలి.. కానీ అందులో కూడా నా మార్క్ ఉండాలి అనుకొని ఈ 'గేమ్‌ఛేంజర్' చేశాను. ప్రభుత్వోద్యోగి, పొలిటీషియన్ మధ్య జరిగే సంఘర్షణే ఈ సినిమా. రామ్‌చరణ్ సెటిల్డ్‌గా చేశాడు. పంచెకట్టులో అప్పన్నగా అదరగొట్టేశాడు. ఈ సినిమాకి అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. రేపు ఆ కష్టాన్ని తెరపై చూస్తారు.' అని శంకర్ చెప్పారు. ఇంకా అంజలి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాత అనిల్ సుంకర, డైరెక్టర్ బుచ్చిబాబు, ఎస్‌జే సూర్య కూడా మాట్లాడారు.

# ఈసారి ఆ తప్పు జరగదు..



ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల వసూళ్లను రాబట్టిన విషయం తెలిసిందే. ఈ సినిమా చివర్లో దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్ 2 –శౌర్యాంగ పర్వం'ను కూడా ప్రకటించేశాడు. దాంతో అభిమానులు సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారందరికోసం 'సలార్ 2' అప్‌డేట్‌ని ఇచ్చేశారు ప్రశాంత్‌నీల్. ఆయన మాట్లాడుతూ ' 'సలార్' భారీ విజయాన్ని సాధించినా.. ఒక దర్శకుడిగా ఆ సినిమా విషయంలో పూర్తి సంతృప్తిగా లేను. ఎక్కడో 'కేజీఎఫ్' ఛాయలు ఆ సినిమాలో కనిపిస్తుంటాయి. 'సలార్ 2 – శౌర్యాంగపర్వం'లో మాత్రం ఆ తప్పు జరగదు. ఓ కొత్త సినిమాను ప్రేక్షకులు చూస్తారు.' అని చెప్పుకొచ్చారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ కథ రాసుకున్నప్పుడే రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే ఇది దేవా– వరదా అనే ఇద్దరు స్నేహితుల కథ. మలుపులు, కుదుపులు లేకపోతే కథ రక్తికట్టదు. స్నేహం సాఫీగా సాగితే కిక్కు ఒడదు. అందుకే.. వారిద్దర్నీ విడగొట్టాలి. వారి మధ్య ఓ పెద్ద అపా ర్థం సృష్టించాలి. ఒకరినొకరు అపార్థం చేసుకోవాలి. శత్రువులుగా మారాలి. ఈ త ర్వాత ఏమైంది? అనేది తెరపైనే చూడాలి. దాన్ని రివీల్ చేయలేను.' అంటూ నవ్వేశారు ప్రశాంత్‌నీల్.



# అనుకున్నట్టే ట్రోల్ చేశారు

మాటల్లో పొరపాట్లు దొర్లడం సహజం. ముఖ్యంగా సినిమాల విషయంలో ఓ పేరుకు బదులు మరో పేరు చెప్పేయడం ప్రతి ఒక్కరికీ జరుగుతూనే ఉంటుంది. ఇటీవల రష్మిక మందన్నా ఓ ఇంటర్వ్యూలో అలాంటి పొరపాటే చేసింది. విజయ్ 'గిల్లీ' సినిమా గురించి మాట్లాడుతూ 'నేను థియేటర్లో చూసిన తొలి సినిమా 'గిల్లీ'. వెండితెరపై చూసిన తొలి హీరో విజయ్ సార్. అందులోని పాటలంటే నాకు చాలా ఇష్టం. ఆ పాటలకు ఎన్నోసార్లు స్టేజ్‌పై డాన్సులు చేశా.' అని చెప్పుకొచ్చింది. అంతవరకూ బాగానే ఉంది.. చివర్లో 'గిల్లీ.. తెలుగులో మహేశ్ సార్ నటించిన 'పోకిరి'కి రీమేక్' అని సెలవిచ్చేసింది. నిజానికి 'గిల్లీ'.. మహేశ్ 'ఒక్కడు' సినిమాకు రీమేక్. మరి సోషల్ మీడియా ఊరుకుంటుందా!? ట్రోల్స్ మొదలయ్యాయి. ఆ వీడియో షేర్ చేస్తూ, రష్మికను ఆటపట్టించడం మొదలుపెట్టారు. దాంతో నాలిక కరుచుకున్న మన నేషనల్ క్రష్.. వెంటనే మరో వీడియో పోస్ట్ చేసింది.. 'గిల్లీ.. ఒక్కడు రీమేక్ కదా.. ఇంటర్వ్యూ అవ్వగానే అనుకున్నా వీడియోను ట్రోల్ చేస్తారని. అనుకున్నట్టే జరిగింది.. నిజంగా సారీ.. 'పోకిరి'ని అదే పేరుతో తమిళంలో రీమేక్ చేశారుకదా.. నాకు తెలుసు. ఏదేమైనా నాకు వారి సినిమాలన్నీ ఇష్టమే..' అంటూ ఫన్నీ ఎమోజీలు జోడించింది రష్మిక. ఇదిలావుంటే.. 'పుష్ప2' హిట్‌తో మంచి జోష్ మీదున్న ఈ అందాల భామ చేతులో ప్రస్తుతం దక్షిణాదితోపాటు బాలీవుడ్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. కుబేరా, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాల్లో ఆమె నటిస్తున్నది.



# గోదారిగట్టు ప్రేమకథ

సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందుతున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రానికి సుభాష్‌చంద్ర దర్శకుడు. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం తొలి షెడ్యూల్‌ని పూర్తి చేసుకున్నది. పశ్చిమగోదావరి జిల్లాలోని రేలంగి, భీమవరం ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపారు. యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటైర్టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయి సంతోష్, సంగీతం: నాగవంశీకృష్ణ